ప్రజాశక్తి
మంగళవారం 24 డిసెంబర్ 2024
5
విజయనగరం

మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులంతా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ధాన్యం, వరి కుప్పలు తడవకుండా జాగ్రత్త తీసుకోవాలని, మరో మూడు రోజులపాటు నూర్పిళ్లు చేయవద్దని సూచించారు. మండల స్థాయి అధికారులతోపాటు ప్రత్యేకాధికారులు సైతం మండలాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడా ఎటువంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉంటూ, అన్ని రకాల ముందస్తు చర్యలను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

చి'వరి'లో రైతులకు తుపాను దెబ్బ

- తడిసి మొలకెత్తిన ధాన్యం
- మరో మూడు రోజులు వర్ష సూచనతో రైతుల్లో మరింత గుబులు
- పంట నష్టాలను పరిశీలించిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి- డెంకాడ

వరి పంట చేతికొచ్చిన దశలో ఐదు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లాలోని పలు మండలాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో కోసి ఉంచిన వరి వనలతోపాటు కుప్పలుగాపెట్టిన వరిదిబ్బలను నూర్పి ఇప్పుటికే సంక్రాంతి జరుపుకుందామనుకున్న రైతులపై వరుణుడు కన్నెర్రజేశాడు. చివరి దశలో పంట నష్టపోవడంతో ఏడాది కష్టం నీటి పాలైందని ఆవేదన చెందుతున్నారు.

డెంకాడ మండలంలో చేతకు అందాల్సిన పంట నేలపాలై రైతులకు అపార నష్టం వాటిల్లింది. ఆ తడిచిన ధాన్యం పూర్తిగా మొలకెత్తడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కాగా మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయన్న సూచనలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో చాలా మంది రైతులు పొలంలో తడిచిన వరి కంకులను ఆరబెట్టేందుకు కుందులుగా పెట్టుకుంటున్నారు. ఇప్పటికే తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని టార్పాలిన్లతో రోడ్లపైకి తరలించి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు ఈ వర్షాలకు దెబ్బతిన్నాయి. ఇప్పటికే కోసి ఉన్న వరి కంకులను సోమవారం వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో గునుపూరుపేట వద్ద

గునుపూరుపేటలో తడిచిన వరిచేలను కుందులు పెడుతున్న రైతులు

రైతులు కుందులుగా పెట్టుకుని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే పొలంలో నీరు ఉండిపోవడంతో కుందులు కూడా కిందకు దిగిపోయి ధాన్యం తడిసిపోతున్నాయి. పోని గట్టుమీద పెట్టుకుందామంటే ధాన్యం అక్కడక్కడ రాలిపోతున్నాయి. నీటిలో తడిసిన ధాన్యం పూర్తిగా మొలకెత్తాయి. కోసిన వరిని జీవితంలో ఇప్పటివరకు కుందులు పెట్టడం చూడలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నువ్వులు పండే సేనును ఒకప్పుడు ఇలా కుందులు పెట్టేవారని ఈ వరిని ఇప్పటివరకు ఇలా కుందులు పెట్టడం చూడలేదని రైతులు అంటున్నారు. తడిసిన ధాన్యం కుళ్ళిపోయి కొంతపోతే మరికొంత మొలకెత్తి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కోలుకోలేకపోతున్న రైతులు

భోగాపురం: వర్షాలకు మండలంలో చాలా చోట్ల వరి పంట దెబ్బతింది. గత రెండు రోజుల నుండి తెరిపి ఇచ్చినప్పటికీ ఇంకా రైతులు కోలుకోలేక పోతున్నారు. చేతికి వచ్చిన పంట మునిగిపోవడంతో పాటు కోయడానికి సిద్ధంగా ఉన్న పంట పొలంలో చాపలా పడిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని లింగాలవలస, పోలిపల్లి గ్రామాల రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఈ నేపథ్యంలో మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయన్న వార్త వారిని మరింత కుంగదీస్తున్నాయి.

వరి నూర్పిడి వాయిదా వేసుకోవాలి

నెల్లిమర్ల: భారీ వర్షాల నేపథ్యంలో వరి పంట నూర్పిడి వాయిదా వేసుకోవాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి పంట నూర్పిడి వాయిదా వేసుకోవాలని సూచించారు. పనల మీద ఉన్న వాటిని కుప్పలు వేసుకోవాలని, నూర్పిడి చేసిన వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని తెలిపారు. పొలంలో నిల్వఉన్న నీరు బయటకు పోవడానికి బాటలు వేసుకువాలని సూచించారు.

పురిటిపెంటలో తడిచిన వరిచేలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

పంట పొలాలను పరిశీలించిన మంత్రి

బొండపల్లి రూరల్ : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన పంట పొలాలను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా పంట నష్ట పోయిన రైతులు మంత్రి ఎదుట ఆవేదన చెందారు. తమను ఆదుకోవాలని కోరారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో నష్టపోవడం భాదాకరమని అన్నారు. తడిచిన పంటల కొనుగోలుకు సంబంధించి అధికారులతో సమీక్ష చేశామని, పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతులు అపరాల పంటకు సంబందించి భీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం తరపున టార్పాలిన్లను మంత్రి రైతులకు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, గజపతినగరం ఎడిఎ కె.మహారాజన్, తహశీల్దారు డి.రాజేశ్వర రావు, వ్యవసాయ శాఖ ఎఒ మల్లికార్జున రావు, ఎంపిడిఒ జి.గిరిబాల, మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ, కెరటాం సర్పంచ్ నంబూరి రాజేష్, టిడిపి నాయకులు బుద్దరాజు

రైతులతో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

సత్యనారాయణరాజు, ఉప్పలపాటి చిరంజీవి రాజు, మాసారపు పోలినాయుడు, మాజీ సర్పంచ్ ముంజేటి పార్వతి తదితరులు ఉన్నారు.

రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలి

గజపతినగరం: వర్షాలు కారణంగా ముంపునకు గురైన వరి, అపరాల పంటలకు ఎకరాకు రూ.50వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఎపి రైతు సంఘం మండల కన్వీనర్ దాసరి సింహాద్రి డిమాండ్ చేశారు. పురిటిపెంట సుబ్బసాగరం, వంక చెరువు, ఊరచెరువు ఆయకట్టు కింద నీటి ముంపునకు గురైన వరి దిబ్బలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరాకు రూ.25వేలు వరకూ ఖర్చు పెట్టి పంటపండిస్తే చేతికి అందివచ్చే సమయంలో అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచేశాయన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే చేసి అంచనాలు రూపొందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఈమేరకు డిటికి వినతి అందజేశారు. కార్యక్రమంలో జి.రామునాయుడు, ఎం.దేవుడు, దాసరి రాము తదిరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు,ప్రజాసంఘాల నాయకులు

రైతులపై అణచివేతను ఆపండి

- జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోండి
- కలెక్టరేట్ వద్ద రైతు, ప్రజా సంఘాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత, బాష్పవాయువు ప్రయోగాలు ఆపాలని, గౌతం బుద్ధ నగర్‌లోని లక్సర్ జైలులో ఉన్న రైతులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతు,ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలనా సూత్రాలకు కట్టుబడి ఉండకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ రైతు నాయకులపై హత్యాయత్నం కుట్రకు బాధ్యులైన పోలీసు కమిషనర్ లక్ష్మీ సింగ్‌పైనా, ఇతరులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 డిసెంబర్ 9న సంయుక్త కిసాన్ మోర్చాతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఎన్‌డిఎ 2 ప్రభుత్వం ఉల్లంఘించిందని అన్నారు. వెంటనే రైతుసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకవర పు ఆదినారాయణ మూర్తి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి గాడు అప్పారావు, కౌలు రైతులసంఘం నాయకులు టి.పైడినాయుడు, రైతు సంఘం నాయకులు దేవర జగన్, కష్ణం నాయుడు, సూరి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం క్రిస్మస్ హైటీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర చిన్న మధ్య తరహాపరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విచ్చేశారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భవిష్యత్ తరాలు సుఖ సంతోషాలతో సన్మార్గంలో నడవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తోందని చెప్పారు. కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, శాంతి ప్రేమ కరుణలకు యేసు ప్రతిరూపమని పేర్కొన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు నడవాలని కోరారు. కార్యక్రమంలో జెసి ఎస్ సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్ఎస్ జాన్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఫాస్టర్లు, క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

పల్లెపండగ పనులు పూర్తి చేయాలి

- లేదంటే అధికారులపై చర్యలు : కలెక్టర్
- ఉపాధి నిధులు ఖర్చుచేయకపోతే జిల్లాకు నష్టంచేసినట్లే
- ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

మండల స్థాయి అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాలో పల్లెపండుగ కింద మంజూరు చేసిన ఉపాధి పనులను సంక్రాంతిలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధిహామీ ఏపిఓలు, జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పల్లెపండుగ పనుల ప్రగతిపై సమీక్షించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, కాల్వలు, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయించిన నిధులను సకాలంలో ఖర్చుచేసి ప్రగతి చూపించాలని స్పష్టం చేశారు. పల్లెపండుగ కింద గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, మెటల్ రోడ్లు, పశువుల శాలలు నిర్మాణం జరుగుతున్న తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. పనుల నిర్వహణలో అలసత్వం చూపే అధికారులపై చర్యలు వెనకాడబోనని హెచ్చరించారు. పనులు మంజూరై రెండు నెలలు కావస్తున్నా నేటికీ 50శాతం పురోగతి లేదని, ఇదే తరహాలో చేస్తే సంక్రాంతి నాటికి జిల్లాలో పల్లెపండుగ పనులు పూర్తిచేయడం అసాధ్యమని చెప్పారు. ఉపాధిహామీట మెటీరియల్ కాంపొనెంట్ కింద జిల్లాకు కేటాయించిన నిధులను వినియోగించలేకపోతే వచ్చే ఏడాది మంజూరు కావని తెలిపారు. జిల్లాకు రూ.350 కోట్ల ఉపాధిహామీ మెటీరియల్ నిధులు కేటాయించగా వాటిని మార్చి నెలలోగా ఖర్చు చేయాల్సి వుందని చెప్పారు. మండలం వారీగా మంజూరు చేసిన పనుల్లో ఏరోజు నాటికి ఎన్ని పనులు పూర్తిచేయగలమనే అంచనాతో తనకు నివేదిక అందజేయాలని డ్వామా పి.డి. కళ్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ ఎస్.ఇ. శ్రీనివాసరావులను ఆదేశించారు. ఇప్పటివరకు మంజూరు చేసిన పనులనే పూర్తిచేయలేకపోతున్నందున ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కోరినప్పటికీ అదనంగా పనులు మంజూరుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ పల్లెపండుగ పనుల్లో నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడటానికి వీల్లేదని అన్నారు. పశువుల శాలల్ని రెండు వారాల్లోగా పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్.ఇ. శ్రీనివాసరావు, జిల్లాపరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ, డ్వామా ఎఒ వెంకటరమణ, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సేవలన్నిటినీ అప్‌లోడ్‌చేయాలి

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 19 నుండి 24 వరకు గుడ్ గవర్నెన్స్ వీక్‌లో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లాలో అందిస్తున్న మూడు ఉత్తమ సేవలపై చర్చించారు. ప్రధానంగా పిజిఆర్ఎస్ వినతులను మెయిల్ ద్వారా, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం , సచివాలయ పరిధి లో ప్రజలకు అన్ని రకాల సేవలను గ్రామ స్థాయిలో అందిస్తున్నామని తెలిపారు.

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

వల్లంపూడి సచివాలయం వద్ద సోమవారం వరల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆర్గనైజేషన్ బృందం వంద రోజులు క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ మీరా కుమారి క్షయ వ్యాధిగ్రస్తులు వాడే మందులపై ఆరా తీశారు. అనంతరం వ్యాధి లక్షణాలున్న వారికి కఫం పరీక్షలకు నమూనాలు సేకరించారు. అనంతరం ఫుడ్ బాక్సులు పంపిణీ చేవారు. కార్యక్రమంలోక్షయ నివారణ అధికారి డాక్టర్ రాణి, డిఎల్‌ఏటిఒలు డాక్టర్ పూర్ణేంద్రబాబు, డాక్టర్ ప్రియ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్, వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఏ.ధరణి, డిటిఎస్ నాగరాజు, కొత్తవలస టిబి యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది, సర్పంచ్ రుద్ర అంజలి పాల్గొన్నారు.

యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలి

జిల్లా పరిశీలకులు ఎంవి శేషగిరిబాబు

ప్రజాశక్తి-విజయనగరం కోట

యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలని, ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ జిల్లా పరిశీలకులు, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ ఐడి ఎంవి శేషగిరిబాబు సూచించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన, ఓటర్ల జాబితా సవరణపై సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. సవరణ ప్రక్రియ సందర్భంగా వచ్చిన క్లైయిములు, ఆమోదించినవి, తిరస్కరణకు గురైన వాటిగురించి ఆరా తీశారు. యువ ఓటర్ల సంఖ్య, ఇపి రేషియో(ఎలక్ట్రోరల్ పాపులేషన్) పై ఆరా తీశారు. ఓటర్ల నమోదు, క్లైయిముల పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులపై అడిగారు. అంతకుముందు డెంకాడ మండలం జొన్నాడ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని శేషగిరిబాబు పరిశీలించారు. బిఎల్‌ఒతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా గురించి సమగ్ర వివరాలను తెలిపారు. ఇప్పటికే డ్రాఫ్ట్ జాబితా సిద్ధమయ్యిందని, జనవరి 5 ఓటర్ల తుది జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ విడతలో సుమారు 1400 మంది యువ ఓటర్లను జాబితాలో చేర్పించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకొనేందుకు ఏడాది పొడవునా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, వాటిని పరిశీలించి సవరణ జరిగినప్పుడు అర్హత ఉన్నవారి పేర్లను జాబితాలో చేరుస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, వివిధ నియోజకవర్గాల ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, డిటిలు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కెవిపిఎస్ , కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/కోట

కేంద్రమంత్రి వర్గంనుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని, అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద వేర్వేరుగా నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నిరసనలో జిల్లా కన్వీనర్ రాకోటి ఆనంద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కలెక్టరేట్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ముందు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసిన అమిత్ షా రాజ్యాంగ నిర్మాతనే హేళన చేస్తూ మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశానికి సెక్యులర్, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌నే అవమానించిన వాళ్లు దేశ ప్రజలకు ఏ రకమైన పాలన అందిస్తారని ప్రశ్నించారు. అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యల వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ

అధికారులకు వినతినిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అధికారులకు వినతినిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, మెడికల్ రిప్ రాష్ట్ర నాయకులు యుఎస్ రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ కార్యదర్శి సిహెచ్ హరీష్, ఐద్వా సహాయ కార్యదర్శి వి లక్ష్మి, మున్సిపల్ కార్మికుల నాయకులు రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను తొలగించాలి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. విద్యాసాగర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గోగాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర మంత్రివర్గం నుంచి ఆయనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేసి రాష్ట్రపతికి పంపాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో -ఆడ్డినేటర్లు డాక్టర్ జి.తిరుపతిరావు, రామచంద్ర రాజు, చైతన్య, దుర్గప్రసాద్, సత్యనారాయణ, జిల్లా యుత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నాయకులు బంగారు నాయుడు, తారా కేశవరావు, షరీఫ్ ,కరిం, రెహమాన్, శ్రీనివాస్, చంద్రశేఖర్, సూరిబాబు, చిలక రాజు పాల్గొన్నారు.

గాంధీనగర్ కాలనీ దళితుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొత్తవలస మండలం ఉత్తరాపల్లి గ్రామం గాంధీనగర్ ఎస్‌సి కాలనీ ప్రజలకు రింగ్ రోడ్డు వలన కోల్పోతున్న ఇళ్లకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడు అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం దళిత కుటుంబాలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, అప్పారావు మాట్లాడుతూ ఈ కాలనీలో సుమారుగా 120 దళిత కుటుంబాలు వ్యవసాయ కులీ పనులు చేసుకుంటూ నివసిస్తున్నారన్నారు. విశాఖపట్నం నుంచి రాయ్ పూర్ ఎన్ హెచ్ 130-సిడి రోడ్డు గ్రీన్ ఫీల్డ్ హైవే లో ఇంటర్ చెంజ్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణలో భాగంగా 20 కుటుంబాల వారు ఇళ్ల కోల్పోతున్నారని తెలిపారు. వాటికి సంబంధించి సర్వే కూడా నిర్వహించారన్నారు. సర్వే ప్రకారం ఇళ్లు కోల్పోయిన కుటుంబాలుకు కాలనీని ఆనుకొని వున్న సర్వే నెం 74/1 లో మెట్ట పొరంబోకు ఉందని, అందులో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కాలనీ వాసులు ఒమ్మి గౌరి, సబ్బవరపు అప్పలస్వామి, విజయ అచ్చయ్యమ్మ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గాంధీనగర్ ఎస్‌సి కాలనీవాసులు,నాయకులు

జనావాసాల మధ్య కోళ్లఫారాన్ని తొలగించాలి

జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన కోళ్ల ఫారంను వెంటనే తొలగించాలని ఎస్. కోట మండలం రామన్నపేట దళిత కాలనీ వాసులు డిమాండ్ చేశారు. కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాధితుల సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్‌జిందల్ ఆదేశించారు. సోమవారం జిల్లాపోలీసు కార్యాలయంలో 17మంది బాధితుల వినతులు స్వీకరించారు. బాధితులను సమస్యలను విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 5, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లుగా 4, ఇతర అంశాలకు సంబంధించినవి 5 ఉన్నాయి. కార్యక్రమంలో డిఎస్‌సి ఎం.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ ఎస్.శంకరరావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎస్‌పి

గణేష్ జ్యూట్ మిల్లును తెరిపించండి

మంత్రి కొండపల్లికి సిఐటియు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్యాయంగా మూసేసిన శ్రీ గణేష్ జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించాలని శ్రీ గణేష్ జ్యూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ (సిఐటి యు) నాయకులు రాష్ట్రచిన్న, మధతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును కోరారు. సోమవారం సాయంత్రం మంత్రిని తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, యూనియన్ గౌరవ అధ్యక్షులు టివి రమణ మాట్లాడుతూ ఈమిల్లులో విజయనగరం మండలం, జామి, ఎస్. కోట, పద్మనాభం మండలాలో ఉన్న వివిధ గ్రామాల నుంచి కార్మికులు గత 13 ఏళ్లకు పైగా పనిచేస్తున్నారన్నారు. యాజమాన్యం నార లేదనే కారణం చూపించి మూసివేసిందన్నారు. నేటికి రెండు నెలలు దాటినా ఇంకా తెరవలేదన్నారు. మిల్లు మూయటానికి కార్మికులకు ఏ విధమైన సంబంధం లేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కార్మికులు చేయని తప్పుకు యాజమాన్యం కార్మికులను గత రెండు నెలలుగా రోడ్డు మీద పడేయటం అన్యాయమన్నారు. కాబట్టి వెంటనే జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కారం చేసి కార్మికులకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు.స్పందించిన మంత్రి కలెక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ నాయకులు ప్రదీప్‌రావు, అప్పారావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని గులివిందాడ అగ్రహారానికి సంబంధించిన ఇనాం భూముల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెల్తానని టిడిపి మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టియన్‌టియుసి జిల్లా ప్రతినిది కలిశెట్టి సత్యన్నారాయణ, రాయవలస మాజీ ఎంపిటిసి రేగిడి వాసు, టిడిపి నాయకుడు అంబళ్ల చిన్నలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాత ముత్తాతల కాలంగా జి అగ్రహారానికి సంబంధించి సుమారు నాలుగు 400 ఎకరాల భూములను అక్కడ రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. అయినప్పటికీ సాగు చేస్తున్న రైతులకు ఆ భుములపై హక్కు కల్పించే విధంగా ఎటువంటి పాస్ బుక్‌లు గానీ, టైటిల్ డీడ్స్ గాని అధికారులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ జి అగ్రహారం రైతుల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తాజాగా నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులలో రెవెన్యూ అధికారులకు రైతులు వారిగా ఫిర్యాదులను అందజేశామన్నారు. మండలంలో గల దేవస్థానం భూములు, సంస్థానం భూములు, గత ప్రభుత్వంలో తప్పుడు సర్వేల కారణంగా జిరాయితీలు సైతం ప్రభుత్వ నిషేధిత జాబితాలోకి మళ్ళి పోవడంతో రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. 22ఏ నిషేధిత జాబితా నుండి భూములను తొలగించి రైతులకు మేలు చేయాలని రెవెన్యూ సదస్సుల అనంతరం స్థానిక ఎమ్మెల్యే కళా వెంకట్రావు ద్వారా సిఎం దృష్టికి సంబంధిత రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోరనున్నామన్నారు. ఈ సమావేశంలో మహేష్, టిడిపి బీసీ సెల్ నెంబర్ రౌతు కనకరాజు పాల్గొన్నారు.

విశ్వాసాన్ని చాటుకున్న పెంపుడు కుక్క

ప్రజాశక్తి- బొబ్బిలి

కుక్కకు ఉన్న విశ్వాసం మనిషికి లేదన్న సామెతను నిజం చేసింది ఒక పెంపుడు కుక్క. పట్టణానికి చెందిన జి.లక్ష్మణరావు ఇంటిలోకి ఈ నెల 20న నాగుపాము ప్రవేశించగా ఇంటిలో ఉన్న పెంపుడు కుక్క పామును చూసి ఇంటిలోకి వెళ్లకుండా పామును కరిచే ప్రయత్నం చేసింది. దీంతో కుక్కను పాము కాటు వేసి బయటకు వెళ్లిపోయింది. పాము కాటుకు గురైన కుక్క తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గమనించిన లక్ష్మణరావు పశువుల ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా పశు వైద్యాధికారి ఎల్.విష్ణు కుక్కకు నాలుగు రోజులు వైద్యం చేసి బతికించారు. పాము కాటుకు గురైన జంతువులను సకాలంలో ఆసుపత్రికి తీసుకు వస్తే వైద్యం చేసి బతికిస్తామని విష్ణు చెప్పారు.

క్రిస్మస్ బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

క్రిస్మస్‌ను పురస్కరించుకొని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, ఆంధ్ర ఇవాంజిలికల్ లూదరన్ చర్చ్ డెలిగేట్ జెసి రాజు పట్టణంలో వివిధ అత్యవసర శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి, అధికారులకు క్రిస్మస్ బహుమతులను సోమవారం పంపిణీ చేశారు. ముందుగా బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావుకు అక్కడ పనిచేస్తున్న కార్యాలయ సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేస్తూ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు చూపిన ప్రేమను మనం అలవరచుకొని ఆ ప్రేమను ఇతరులకు చూపాలన్నారు. వీరితో పాటు బొబ్బిలి మల్టీ టేలెంటెడ్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షులు కరుణ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డిఇ

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పెరుమాలి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన బోరును బొబ్బిలి డివిజన్ డిఇ డిల్లేశ్వరరావు సోమవారం పరిశీలించారు. బాత్ రూములకు వాటర్ ట్యాప్‌లు వెయ్యాలని ఆదేశించారు. ఎంఆర్ అగ్రహారంలో వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. నందిగాంలో తాగునీటి బోరు వేయించినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు మండల జెఇ సంతోష్‌కుమార్, పెరుమాలి సర్పంచ్ భర్త అప్పలనరసింహరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతుల భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహశీల్దార్ పి.సుదర్శనరావు తెలిపారు. సోమవారం వల్లూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి వినతులు స్వీకరించారు. అనంతరం తహశీల్దార్ సుదర్శనరావు మాట్లాడుతూ భూ సమస్యలపై అర్జీలు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పంచాది జగమోహన్, ఎల్.సన్యాసిరావు, ఆర్ఐ పి.వేణుగోపాల్, సర్వేయర్ దివ్య, ఆర్ఎస్‌డిటి ఎం.సత్య నారాయణ, విఆర్ఒ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముటేషన్ల కోసం 10 దరఖాస్తులు వచ్చాయని డిటి డి. సన్యాసి నాయుడు తెలిపారు. ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, ఉప సర్పంచ్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వందేళ్ల భారీ వృక్షం

ప్రజాశక్తి - వేపాడ

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి పూర్తిగా నానిపోడంతో జాకేరు గ్రామం వద్ద ఉన్న వందేళ్ల చరిత్ర కలిగిన భారీ చింత చెట్టు సోమవారం నేలకొరిగింది. ఈ వృక్షం కూలిపోయే సమయంలో నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతమైనప్పటికీ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జవాను కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమతో పాటే జవానుగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన తోటి జవాన్ కుటుంబానికి అండగా నిలిచారు జవాన్లు. నగరంలోని దాసన్న పేటకు చెందిన దువ్వ వెంకటేష్ ఐటిబిపి 41వ బెటాలియన్ భువనేశ్వర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ వెంకటేష్ కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఐటిబిపి తెలుగు జవాన్లు రూ.82వేలు ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి, ఐటిబిపి జవాన్లు ఉరిటి పైడినాయుడు, ఎ.వెంకట్రావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : ఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంహెచ్‌ఒ డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సూచించారు. సోమవారం వివిధ ప్రాంతాలలో పర్యటించిన ఆయన చెత్త తరలింపు, కాలువల్లో పూడికతీతలు పనులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుచుకోవాలని చెప్పారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల క్రిమి కీటకాలు వద్ధి చెంది ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుందని అన్నారు. సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తూ ఎక్కడా చెత్తలు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రపరిచేందుకు కషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

వేపాడ: గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు ఆతవ రవిశంకర్, రమేష్ నాయుడు ఆధ్వర్యంలో గణిత దినోత్స వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి ఎంఇఒ-2 బాల భాస్కర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మానవునిలో ఆలోచన శక్తి, తార్కికతత్త్వం పెంచేది గణితమేనని విద్యార్థులందరూ తప్పకుండా గణితం నేర్చుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా రామానుజన్ నెంబర్ 1729 ఆకారం లో కూర్చొని నివాళులర్పించడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నదిలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన సామాదుల లక్ష్మణ (70)చంపావతి నదిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళ్లి చంపావతి నదిలో గల్లంతయ్యాడు. రాత్రంతా కుటుంబీకులు గ్రామస్తులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం మధ్యాహ్నం నడిపిల్లి సమీపంలో చంపావత నదిలో ఆయన మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందర్‌పేట సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వినతులన్నింటికీ పరిష్కారం చూపాలి

- వినతుల ఆడిట్ కోసం
- 13 శాఖలకు బృందాలు
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ఆర్థికపరమైన , కోర్టు కేసులకు సంబంధించిన వినతులు తప్ప మిగిలిన అన్ని వినతులకూ సరైన పరిష్కారాన్ని చూపాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ వినతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నివ్వడమే కాకుండా ప్రతి వినతిని కూలంకుషంగా పరిశీలిస్తోందని, వినతుల పరిష్కారం లో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేసారు. సోమవారం పిజిఆర్ఎస్ లో వినతులను స్వీకరించే ముందు అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల్లో పర్యటించేటప్పుడు ఆ గ్రామాలకు సంబంధించిన పిజిఆర్ఎస్ వినతులను కూడా తీసుకు వస్తారని, ఎలాంటి పరిష్కారం జరిగిందోనని అర్జీదారులతో కూడా మాట్లాడతారని , నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని కల్లెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి తెలిపినట్లు కలెక్టర్ వివరించారు. వినతులకు సరైన , నాణ్యమైన సమాధానాలు రాయాలని, సమాధానం పంపే ముందు అర్జీదారుతో మాట్లాడాలని తెలిపారు.

అర్జీలను అప్లోడ్ చేసే సిబ్బందికి కల్లెక్టరేట్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీలకు అధికారులు నాణ్యమైన సమాధానాలు ఇచ్చేలా పర్యవేక్షించేందుకు 13శాఖలకు ఆడిట్ అధికారుల బృందాలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో అర్జీలను అందజేయడానికి వచ్చే వారి కోసం సోమవారం ప్రత్యేకంగా కుర్చీలను ఏర్పాటు చేసారు. సమావేశంలో జెసి సేతుమాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.

జెసికి వినతినిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

పిజిఆర్ఎస్ కు 140 వినతులు

సోమవారం పిజిఆర్ఎస్ కు 140 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్అంబేద్కర్ , జేసి సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 140 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 96 వినతులు అందాయి.

జిల్లా ఆస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సులను ఖాళీ చేయించాలి

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వద్ద నుంచి ప్రైవేటు అంబులెన్స్‌లను ఖాళీ చేయించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అధికారులను కోరారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాస్పత్రి వద్ద ప్రైవేట్‌అంబులెన్సులు ఉంచి ఆసుపత్రి వార్డు బోయ్‌లతో కలిసి రోగుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఇక్కడి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు వద్దనునున్న మెడికవర్‌ఆస్పత్రికి ఒక రోగి నుంచి రూ.1200 వసూలు చేశారని తెలిపారు. వినతినిచ్చిన వారిలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు యుఎస్ రవికుమార్, ప్రభు, సూరి, ఈశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ , సహాయ కార్యదర్శి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

- ప్రధాన రహదారులకు ఆనుకొని ఏర్పాటు చేస్తున్న షాపింగ్‌మాల్స్ వల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు కోరారు.

- 15 ఏళ్లుగా ఎస్ ఎల్ ఎఫ్ గ్రూపులో దాచుకున్న డబ్బులు తమకు ఇప్పించాలని నగరమలోని 24 వార్డు కు చెందిన పొదుపు సంఘాల మహిళలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మహిళలు

లింగ వివక్షతపై కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ లింగ అసమానత్వ సమస్యలు ఎదుర్కోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి లింగ వివక్షతకు వ్యతిరేకంగా గత నెల 25 నుంచి ఈనెల 23 వరకు జాతీయ ప్రచారం నిర్వహణలో భాగంగా సోమవారం చీపురుపల్లి పట్టణ పరిధిలోని విజయ కాలనీలో భారీగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమం చివరి రోజు సందర్భంగా చీపురుపల్లిలో గల విజయా కాలనీలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా ఎస్‌హెచ్‌జి మహిళలతో కొవ్వ త్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎన్.అప్పలనాయుడు, సీసీ గోవింద్, విఒఎ కుమారి, మహిళలు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి ఎంపిపిఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఎంఇఒ జి జగదీశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా పాఠశాల ఆవరణ, టాయిలెట్స్, గార్డెన్, తరగతి గదులు పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల పని వేళల్లో టాయిలెట్స్ రోజుకి మూడు సార్లు పరిశుభ్రం చేయాలన్నారు. అనంతరం భవిత సెంటర్ పరిశీలించి విద్యార్థులు సామర్థ్యాన్ని, రికార్డులను పరిశీలించారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రముఖ భవనాలకు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా తీసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఈర్ల రామసూర్యారావు సూచించారు. మండల కేంద్రంలోని సోమవారం ఎన్ఆర్ఐ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ముఖ్యంగా పవర్ సిస్టంను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫైర్ ఎక్విప్మెంట్ పరికరాలపై ఆరా తీశారు. ఫైర్ డీజి ఆదేశాల మేరకు ఆసుపత్రిల్లో సౌకర్యాలపై దృష్టి సారించామన్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఇన్చార్జ్ చంద్రిక, ఫైర్ హెూంగార్డు సిద్ధా బత్తుల రవి పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపుతో షాక్

- పలు ఛార్జీల పేరిట బిల్లుల మోత
- వినియోగించిన విద్యుత్తు కంటే ఇతరములే అధికం
- యూనిట్లు తగ్గినా విద్యుత్తు బిల్లులు మోత

సంకిలికి చెందిన సూరు చక్రధర్‌కు సర్వీస్ నెంబర్ ఎన్ 148000582 గత విద్యుత్తు బిల్లులో 224 రూపాయలు రాగా ప్రస్తుత బిల్లు 524 రావడంతో ఎలా కట్టేదని వాపోయారు.

పెద్ద లింగాలవలస గ్రామానికి చెందిన గండి బాబూరావు రోజు కూలి చేసుకుంటూ కుటుంబాన్ని పోసిస్తున్నాడు. అతనికి డిసెంబర్ నెల బిల్లు 30 వేల రూపాయలు వచ్చింది. ఈ విషయం ఉంగరాడ మెట్ట 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో వినియోగదారుడు గృహానికి వెళ్లి పరిశీలించగా గత బిల్లు చూపిస్తే రూ.5వేలు ఉందని, ప్రస్తుత బిల్లు 30 వేల రూపాయలు వచ్చిందని ఇలా అయితే తాము ఎలా బతకాలని గుండెలు బాదుకుంటున్నాడు.

ప్రజాశక్తి- రేగిడి

ఇలా బాబురావు, చక్రధరల పరిస్థితే కాదు. మండలంలోని చాలా మంది పరిస్థితి ఇలాగే ఉంది. గతంలో ఎప్పుడో వినియోగించిన విద్యుత్తుకు ఇప్పుడు కష్టకాలంలో బిల్లులు వసూలు చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలు కాకముందే విద్యుత్తు ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు మోపడం ఏంటని మండిపడుతున్నారు.

మండలంలోని 39 గ్రామ పంచాయతీలో 21,517 విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. వీరిలో సగానికి పైగా జనానికి వచ్చిన యూనిట్లు తక్కువైనప్పటికి విద్యుత్తు బిల్లులు మాత్రం అధికంగా వచ్చాయి. కూటమి ప్రభుత్వం తాజాగా విధించిన ఎఫ్‌పిపిసిఎ ఇతర ఛార్జీలు కలుపుకుని ప్రస్తుతం విద్యుత్తు బిల్లులు రీడింగ్ తియ్యడంతో వినియోగదారులు పెరిగిన బిల్లులతో అవాక్కవుతున్నారు. గత ప్రభుత్వం విధించిన విద్యుత్ బిల్లులో భాగంగా ఎఫ్‌పిపిసిసిఎ-2లో 30 రూపాయలు, కస్టమర్ ఛార్జీలు 30 రూపాయలు, సర్ ఛార్జీలు 25 రూపాయలు, ఫిక్సెడ్ ఛార్జ్ 10 రూపాయలు ఇలా అన్ని రకాల ఛార్జీలను వచ్చిన యూనిట్లుకు కలిపి లెక్క గట్టి బిల్లు జారి చేస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

రోజు కూలీతో బతుకుతున్న తమ కుటుంబాలకు ఇంతేసి విద్యుత్ బిల్లులు వస్తే ఎలా బతకగలమని దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు వాపోతున్నారు. సామాన్యంగా ఇంటిలో ఒక టీవీ, రెండు బల్బులు, ఒక ఫ్యాన్, మాత్రమే వాడుతున్న సామాన్యులకు అధికంగా బిల్లులు రావడంతో నెల వారి బిల్లులు ఎలా కట్టేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతనెల కంటే రెట్టింపు బిల్లులు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. యూనిట్ తగ్గినా పెరిగిన బిల్లులు అధికంగా రావడంతో అవాక్కవుతున్నారు.

నవంబర్, డిసెంబర్ నెలల్లో వచ్చిన బిల్లుల్లో వ్యత్యాసం

అధిక బిల్లు రావడంతో అవ్వక్కయ్యాను

డిసెంబర్ నెల బిల్లు రూ.30వేలు రావడంతో అవాక్కయ్యాను. రోజు కూలి చేసుకొని జీవనం సాగిస్తున్న నాకు ఇలా అధిక విద్యుత్ బిల్లు రావడంతో ఒక్కసారి తుళ్ళి పడ్డాను. ఈ విషయం లైన్ మాన్‌కి చెప్పాను. మారుస్తామని అన్నారు.

గండి బాబూరావు, వినియోగదారుడు, లింగాలవలస

పాఠశాలలో రామానుజన్ క్లబ్‌లు ఏర్పాటు

- ప్రత్యేక తరగతులతో శతశాతం ఉత్తీర్ణత
- ఏటా విద్యార్థులకు ప్రోత్సాహకాలు : బంగారయ్య మాస్టారు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శివుకు బంగారయ్య మాస్టారు ఉపాధ్యాయ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే పలు సేవాకార్యక్రమాలు చేపడుతూ నిరంతరం సామాజిక, విద్యార్థుల శ్రేయస్సు కోసం శ్రమిస్తూ పలువురు మన్ననలు పొందుతున్నారు. ఆయన ఉపాధ్యాయ వృత్తి జీవితం ప్రారంభించి 26 సంవత్సరాలుగా నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి చేస్తున్నారు.

రామానుజన్ క్లబ్‌లు ఏర్పాటు

బంగారయ్య మాస్టారు ఇటీవల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు గణతంపై ఆసక్తి పెంచే దిశగా రామానుజన్ క్లబ్‌ను ఏర్పాటు చేసి అందులో విద్యార్థులను భాగస్వాములుగా చేసి దాని ద్వారా గణిత కృత్యాలను స్వయంగా నిర్వహిస్తున్నారు. ఏటా గణిత దినోత్సవం జరపడమే కాకుండా టాలెంట్ టెస్ట్ పెట్టడం, క్విజ్ నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు సొంత డబ్బులతో బహుమతులు అందజేస్తున్నారు. ఏటా సొంత డబ్బులు ఖర్చు చేసి విద్యార్థులను విజ్ఞాన విహారయాత్రలకు తీసుకుని వెళ్లి వారికి అక్కడ ఉచితంగా భోజనాలు పెట్టడం అలవాటుగా చేసుకున్నారు. ప్రతీ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం, పరీక్షలకు బయలుదేరే ముందు విద్యార్థులకు ప్లాంకులు, పెన్నులు పెన్సిల్లు, షార్పనర్లు, ఎరేజర్లు కిట్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

గణితంలో శతశాతం వచ్చిన వారికి నగదు పారితోషకం

గణితంలో 100/100 మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకం అందిస్తున్నారు. రిజల్ట్స్‌లో స్కూల్ ఫస్ట్, సెకండ్ వచ్చిన వారికి నగదు బహుమతులు ఇస్తున్నారు. పాఠశాల విద్యార్థులు చేరికను పెంచే దిశగా ర్యాలీ నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏటా విద్యార్థులకు ఎన్ఎంఎం పరీక్షకు తర్ఫీదునివ్వడంలో వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇచ్చి సెలవుల్లో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం సాయంత్రం అదనంగా స్టడీ క్లాసులు నిర్వహించడం నిరంతరం కొనసాగిస్తున్నారు. వీరి తర్ఫీదులో నలుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీ, ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎస్‌కి ఎంపిక అయ్యారు. అనాథ విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి సహాయం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల విజయవాడ వరద బాధితుల కోసం పాఠశాల విద్యార్థుల ద్వారా విరాళాలు సేకరించి కలెక్టర్ చేతికి అందజేశారు. ఇలా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న బంగారయ్య మాస్టారును పలువురు అభినందిస్తున్నారు.

పాఠశాలలో చేరాలని తల్లిదండ్రులకు సూచిస్తున్న బంగారయ్య మాస్టర్

అధికారులను ప్రశ్నిస్తున్న బానాది ఎంపిటిసి గొంప తులసి

ఇలాంటి సమావేశాలెందుకు?

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాల యంలో ఎంపిపి డి.సత్య వంతుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో అధికారులను సభ్యులు పలు సమస్యలపై నిలదీశారు. ముందుగా వ్యవసాయంపై చర్చించిన సభ్యులు ధాన్యం కొనుగోలు చేపట్టిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు వస్తున్నాయని హర్షం వ్యక్తంచ చేశారు. ఎంఇఒలు మాట్లాడుతుండగా బానాది ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ తమ గ్రామంలో పాఠశాలకు వెళ్లేందుకు మార్గం లేదని, వర్షాకాలం వస్తే ఉపాధ్యాయులు పిల్లలు బురద గట్లపై నడిచి వెళ్ళడం వల్ల పలుమార్లు జారి పడి గాయాలపాలైయ్యారని చెప్పారు. పాఠశాలకు మార్గం వేయా లని పలుమార్లు సమావేశంలో అధికారులకు ప్రజాప్రతినిధులు తెలిపినా పట్టించుకోలేదని అలాంటప్పుడు తమను సమావేశాలకు ఎందుకు పిలుస్తున్నారని ప్రశ్నించారు. దీనికి స్పందించిన అధికారులు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది సభ్యులు పశువుల షెడ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని సభలో ప్రసాదించగా సరి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ సూర్యనారాయణ మాట్లాడుతూ ఇక ముందు సమావేశాలకు మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తహశీల్దార్ జె.రాములమ్మ, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సిహెచ్‌సిని వంద పడకల స్థాయికి పెంచుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

సుందర పేట సామాజిక ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకల స్థాయి పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలోని మూడు మండలాలకు ఈ ఆస్పత్రి ఎంతో ముఖ్యమైందన్నారు. హైవేపై ప్రమాదాలు జరిగేటప్పుడు అందుబాటులో ఉండే ఈ ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచుతామన్నారు. దీనిపై ఆరోగ్య శాఖ మంత్రిని కూడా కలిశామని చెప్పారు. ఆసుపత్రికి మౌళిక సదుపాయాలను కల్పించేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సక్రమంగ సేవలు అందించాలని దీనిపై ప్రతినెలా నివేదిక రూపంలో ఇవ్వాలని అన్నారు. వైద్య అధికారి బి వెంకటేష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు

తొలుత ఆసుపత్రి అభివృద్ధి నూతన కమిటీని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారు. చైర్మన్‌గా ఎమ్మెల్యే లోక మాధవి, కన్వీనర్‌గా వైద్యాధికారి బి వెంకటేష్, సభ్యులుగా ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్, భోగాపురం ఇంచార్జి ఇఒ ఎస్ కనకరాజు, జనసేన పార్టీ నాయకులు బొల్లు త్రినాథ్, కొండపు రాధాకృష్ణారెడ్డి, మహిళా సమాఖ్య నుంచి ఇప్పిలి అప్పలకొండను ఎంపిక చేశారు.

ఆటోలు ఢీకొని 10 మందికి గాయాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని చినమ్మతల్లి గుడి సమీపంలో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొని 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని రావివలస గ్రామానికి చెందిన కొంత మంది బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు వస్తుండగా ఎదురుగా రామభద్ర పురం నుంచి బొబ్బిలి వెళుతున్న మరో ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొబ్బిలి మండలం రాజు పేటకు చెందిన ద్వారపురెడ్డి అచ్చియ్యమ్మ, కోరెడ్ల మంగ, బొబ్బిలికి చెందిన పారాది రూప, ఫణిశ్రీలకు గాయాలయ్యాయి. వేరే ఆటోలో ఉన్న రామభద్రపురం రావివలస గ్రామాలకు చెందిన దుమ్మరి సీతయ్య, గోధుమ దివ్యా, సోములు జమ్మయ్యా, గోధుర సీతయ్య, గోధుర రాములమ్మ, గోధుర శైలజలకు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో సోములు, జమ్మయ్య, శైలజకు తీవ్ర గాయాలు కావడంతో బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ ఐవి.రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెల్లాచెదురుగా పడి ఉన్న క్షతగాత్రులు

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

- 45 మందికి స్వల్పగాయాలు
- మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆరికతోట వద్ద ఆర్‌టిసి బస్సును వెనుక వస్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. బస్సులో ప్రయాణిస్తున్న 45 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం ఉదయం విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్తున్న పల్లెవెలుగు బస్సును దాని వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ఈ ధాటికి ఆ బస్సు ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొనడంతో రెండు లారీల మధ్య బస్సు ఇరుక్కొని నుజ్జునుజ్జు అయ్యింది. బస్సులో డ్రైవర్ సీటుకు ఎడమవైపు సీటులో కూర్చున్న బొండపల్లి మండలం గరుడబిల్లికి చెందిన రెడ్డి మహాలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు సీటు మధ్య ఆమె రెండు కాళ్లు ఇరుక్కొని ఉండిపోవడంతో ఆమెను బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా కష్టపడ్డారు. చివరకు జెసిబిని రప్పించి బస్సు ముందుభాగాన్ని విడదీసి ఆమెను బయటకు తీయాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఆమె ఎడమ కాలు విరిగిపోయింది. ముందు వెళ్తున్న లారీ హఠాత్తుగా వేగం తగ్గి పోవడంతో బస్ డ్రైవర్ స్లో చేసినప్పటికీ వెనుక వస్తున్న మరో లారీ బస్సును ఢీకొంది. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహన్ రావు, స్థానిక తహసీల్దార్ సులోచనారాణి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద ఘటనను పరిశీలించారు. గాయపడిన మహాలక్ష్మి ప్రాణాలు కాపాడేందుకు గ్రామస్తులు బాగా శ్రమించారు. ఆమెను బయటకు తీసేందుకు గంటన్నరసేపు శ్రమించినప్పటికీ 108 వాహనం రాకపోవడంతో ఆటోలో ఆమెను ఆస్పత్రికి తరలించడం పట్ల స్థానికులు ఆవేదన చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

రెండు లారీల మధ్య చిక్కుకున్న బస్సు

సీటు మధ్యలో ఇరుకుక్కన్న మహిళ

యాచకుడు మృతి

ప్రజాశక్తి - సంతకవిటి

గత 5,6 సంవత్సరాల నుంచి పొనుగుటవలస □పరిధిలో బిక్షాటన చేస్తూ జిఎంఆర్ కాలేజ్ ఎదురుగా ఉన్న బస్సు షెల్టర్‌లో ఉంటూ జీవించే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. ఈ మధ్య రోడ్డు పనులు జరుగుతున్నందున బస్సు షెల్టర్‌ను ఆర్ అండ్ బి అధికారులు కూల్చివేశారు. అందులో తలదాచుకునే సదరు బిక్షగాడికి ఉండేందుకు ఆవాశం లేకపోయింది. దీంతో రోడ్డు పక్కన ఉంటూ ఈ మధ్య కురిసిన వర్షాలకు పూర్తిగా తడిసిపోయి అనారోగ్యానికి గురై ఆదివారం సాయంత్రం పాలకొండ రాజాం రోడ్‌లో కొయ్యన తిరుమలరావు వాటర్ సర్వీస్ సెంటర్ దగ్గరలో రోడ్డు పక్కన చనిపోయాడు. దీంతో పొనుగుటవలస విఆర్ఒ రోజా రమణి పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేయగా సంతకవిటి ఎఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.